తోణికించి, కన్ను మూసేవుంటుంది. కాని... ఎవరిమీద పగతీసుకోందుకు తనని యిలా చేసింది కనకం? తను కనులు మూసి చల్లగా వెళ్లిపోయిందే: దానితో సమస్యలన్నీ విడిపోతాయని తలచిందా? అసలు జీవిత కథనానికి ముగింపు ఏమిటి? ఈ లోకంలో దేనికి సమాప్తి ఉంది? వసంతంలో వేసవికోసం, చలికాలంలో వసంతాగమనంకోసం, చేజారిన మధుర క్షణాలకోసం, రాబోయే కష్టాలకోసం బాధపడుతుందేకాని, మానవ హృదయం - వసంతంలో వసంతాన్ని చేజారకుండా మధురక్షణాలనీ అనుభవించదు. అనుభవించడంలో కంటే, వాటినిగురించి ఆలోచించడంలో ఎక్కువ ఆనందం వుంటుందేమో! కనకం అంతే చేసింది. తను ఆనందించలేదు. తనని ఆనదించనివ్వలేదు ...కాని యిప్పుడు అంతా శూన్యంచేసి తన దారిన తను వెళ్ళిపోయింది. ప్రపంచం తనకేం లోటుచేసింది? అందరం ఆమె ఆనందంకోసం చెయ్యకలిగినదంతా చేశారు. దానిని అనుభవించే మార్గంలో ఆమె యితరులకి దుఃఖం కలిగించింది.

చీకటులని పారదోలి లేయెండలు ఆక్రమించుకొంటున్నాయి. కృష్ణమూర్తి బరువుగా లేచాడు కిటికీదగ్గరనుంచి. సముద్ర మధ్యంలో కెరటాల తాకిడికి తట్టుకునే దీపస్తంభంలా, తనూ కనకం రేపిన అలల వలయాలమధ్య పడ్డ రాయినే ఆధారంగా చేసుకున్నాడు. రాయితో కూడా వుంటే అలల ప్రయాణ తాకిడికి నిలవవచ్చునని ఆశ. కానీ...ఏమో! మానవునికి మనశ్శాంతి యీ లోకంలో లేదు. మానవుడు ఎంత మానవత్వం చూపుదామన్నా, అతనికి దానవతే ఎదురౌతుంది. ఎదురెండ ముఖానికి రాకుండా కిటికీరెక్కలు చేరవేశాడు కృష్ణమూర్తి.

---

కథానిక

# వెన్నంటిన నీడలు

"శ్రీధర్"

ఆవి నేను కలకత్తాలో ఒక పెద్ద కంపెనీలో సేల్సుమేనేజరుగా పనిచేస్తూన్న రోజులు. పది హేనువందలు జీతం, మంచి బంగళా, కారు- ఒక్కమాటలో-ఆనందోద్వేగంతో కాలం చాలా జోరుగా గడిచిపోయేది. జీవితంలో ఉండే-లేక ఉంటుందనుకునే- చీకటిభాగం ఎప్పుడూ కనిపించేదికాదు. ఏదో స్త్రీల వ్రతకథలో చెప్పినట్టు 'కష్టాలెలాగుంటాయి' అనడిగేట్లుండేవి ఆ రోజులు.

ఒకనాడు సాయంకాలం మామూలుగా ఆఫీసు నుంచి కార్లో బంగళాకొచ్చి, శుభ్రంగా మొహం కడుక్కుని, నా రూములో సోఫాకి నడుం చేరవేసి నేను మా శ్రీమతి అందించిన కాఫీ సేవిస్తూ.

ఇంతలో మా హిందుస్థానీ నౌకరు గుమ్మంవద్ద కొచ్చి, "మహారాజ్" అన్నాడు.

"ఏం?" అన్నాను.

"ఎవరో ఒకబ్బాయి తమరికి దీన్నిమ్మన్నాడండి" అంటూ ఒక చిన్న కాగితం అందించేడు.

"ఎవరితను?" అని ప్రశ్నించేను కాగితంవైపు చూస్తూ. "నందలాల్ కిషోర్" అన్న అక్షరాలు ముద్దుగా ఇంగ్లీషులో వ్రాయబడివున్నాయి.

"తెలీదు సార్. తమదర్శనం కావాలంటున్నాడు" అన్నాడు నౌకరు.

"సరే. ఆఫీసు రూములో కూర్చోమను, ఇప్పుడే వస్తాను" అని టై నిలువుటద్దంలో సరిచూసుకుని, కోటు బుజాన తగిలించుకుని బయల్దేరబోతున్నా—

మా శ్రీమతి అప్పటికప్పుడే పూర్తిగా టాయ్‌లెట్ అయిందేమో-

"ఏమండోయ్! త్వరగా తెములండి. సినిమా ప్రోగ్రాం మరిచిపోయేరా?" అని హెచ్చరించింది.

"మరిచిపోలేదుగాని డ్రైవరున్నాడా? వెళ్ళిపోయాడా? ఉంటే కారు పెకితీసి ఉంచమను."

"ఉన్నాడు. మీరు తయారయ్యేటప్పటికి నేనుకూడా పిల్లల్ని ముస్తాబుచేస్తా. వేగంరండి" అనేసి వెళ్ళిపోయింది.

నేను ఆఫీసురూమువైపు నడిచాను.

* * *

ఆఫీసురూములో ఒకపక్కగా స్టూలుంటే దానిమీద కూచున్నాడొక అబ్బాయి. చిన్నవాడే. సుమారు పద్ధెనిమిదేళ్ళుంటాయేమో. చేతిలో సంచి ఒకటుంది. అతనిముఖంచూస్తే చాలాదూరప్రయాణం చేసినవాడిలా అవుపిస్తున్నాడు. నేనూ గదిలో ప్రవేశించగానే "నమస్కారం సార్" అని నమస్కారం చేసేడు. కూర్చోమని సంజ్ఞచేసి నేనూ కూర్చున్నాను.

"నీ పేరు?" అడిగాను.

"నందలాల్ కిశోర్ అంటారండి"

"ఏవూరు?"

"రాధానగర్"

రాధానగర్ కలకత్తాకి కొద్దిదూరంలోవుండే ఒకపల్లెటూరూకాని పట్టణంకాని మధ్యరకపు వూరు.

"ఏంపనిమీదొచ్చేవు?"

"తమ ఆఫీసులో చిన్నఉద్యోగం ఏదైనా" అంటూ అర్థోక్తిలో ఆగిపోయేడు.

"ఇంత చిన్నవయస్సులో ఉద్యోగమా?" కొద్దిగా నవ్వుతూ అడిగాను.

"పరిస్థితులు విషమిస్తే ఇంకా చిన్నవయస్సులోకూడా జీవనోపాధి వెతుక్కోవాల్సి వస్తుందిసార్" అన్నాడు గంభీరంగా.

నేనుమాత్రం,

"మరేంఫరవాలేదు. శుభ్రంగా చదువుకోవాలీ యీస్కూలులో. కావాలంటే సహాయంచేస్తాను. అంతేగాని అప్పుడే నీకుద్యోగమేమిటీ?" అన్నాను.

"లాభంలేదండి. ఈ స్కూలుఫీజులు పేసయేసరికే అష్టకష్టాలూ పడడమయింది. ఎవరైనా ఎన్నాళ్ళని సహాయం చేయగలరు? అందుకనే ఏదోస్వంతంగా బతుకుదామని తమదగ్గిరికి—" అన్నాడు

నాకేంచెప్పాలో తోచిందికాదు.

"[illegible]లేరా?' అనడగాలనుకున్నా.

కాని నిజంగా తండ్రిలేకపోతే ఆ ప్రశ్నతో కుర్రాణ్ణి అనవసరంగా బాధించినట్టవుతుందని మానేశాను.

"ఏం? ఇప్పుడేమంత పరిస్థితులు విషమించాయి నీకు?"

"తమరు క్షమిస్తే ఈ ప్రశ్నకి నా కథంతా చెప్పాల్సొస్తుంది. చెప్పమంటారా?" అనడిగాడు.

ఇక్కడమట్టుకు నాకు నిజంగా ఆశ్చర్యమనిపించింది. ఎచేతంటే నా కావయస్సులో 'విషమ పరిస్థితులూ' లేవు, చెప్పుకోతగ్గ 'కథా' లేదు. అదేమిటో వినాలనే అనిపించి త్వరగా చెప్పమన్నాను.

"మాది రాధానగర్, నా పేరు నందలాల్ కిశోర్—ఈ రెండు సంగతులూ మీకు తెలిసినవే కదా? తల దాచుకొందు కొక్కయిల్లు తప్ప మరే ఆస్తులూ లేవు మాకు. మా నాన్నకి నేనూ మా తమ్ముడూ మాత్రమే సంతానం. తరవాత కొన్నాళ్ళకి మా అమ్మ చచ్చిపోయింది. మా కొక్క మేనమామమాత్రం వున్నాడు. అమ్మ బతికున్నన్నాళ్ళూ నాన్న మా వూళ్ళోనే మనసబుగా వుండేవాడు. అమ్మపోయినప్పటినుండీ ఏదో విరక్తి పొందినవాడిలాగ తిరిగేవాడుట. తరవాత ఉన్నట్టుండి యుద్ధంలోకి వెళ్ళిపోయేడుట. వెళ్ళిపోయేముందు నన్నూ, మా తమ్ముడినీ మావయ్యగారింటిదగ్గిర దిగపెట్టేసి మరీ వెళ్ళిపోయేడు."

"ఇన్నేళ్ళుగా మే మిద్దరం మావయ్యగారింట్లోనే వుంటున్నాం. నాన్న బతికున్నాడో తెలీదు, లేదో తెలీదు. యుద్ధంనుండి తిరిగొచ్చే వరకూ అతనిమీద నిరాశే చేసుకున్నాం. అప్పుడప్పుడు మావయ్యమాత్రం పైకంటూ వుండేవాడు 'మీనాన్నొస్తాడు లె డ'ని."

"అలాగే రెణ్ణెల్ల క్రిందట మావయ్యగారింటికి నాన్న యుద్ధంనుండి తిరిగొచ్చేడు. కాని అప్పటి కప్పుడే తాగుడూ మొదలైన వ్యసనాలన్నీ అలవడ్డాయి నాన్నకి."

"ఇన్నాళ్ళూ మాకు నాన్న అనేవ్యక్తి ఉన్నాడని మాత్రమే తెలుసు కాని ఎలాగుంటాడో కూడా ఊహించుకో లేకపోయేవాళ్ళం. ఇన్నాళ్ళకి మాకూ "నాన్న" ఒచ్చేడుగదా అని ఎంతో

సంతోషించేం. దగ్గరకు వెడదామనుకునేవాళ్లం. కాని అతన్ని చూస్తేనే భయంవేసేది మా కిద్దరికీ. కాని చూడకుండా ఉండలేక పోయేవారు. చాటుగా ఏ కిటికీసందులోనుంచో చూసేవాళ్లం. మళ్ళా అంతలోనే భయంవేసేది. దూరంగా పాఁపోయేవారం."

"అక్కడ తను రెండు రోజులుమాత్రమే వున్నాడు."

"రెండోనాడు నన్నూ, తమ్ముడినీ నాన్నే పిల్చేడు. వెళ్ళడానికి నేను మొదట కొంచెం భయపడ్డాను. కాని అంతలోనే ధైర్యం తెచ్చుకుని తమ్ముడినికూడా పిలిచేను. వాడు మాత్రం రాలేదు. నాన్నని చూసేసరికే భయపడి పారి పోవడం ప్రారంభించేడు. ఎంతకీ రాకపోయేసరికి ఇద్దర్నీ తిట్టి ఇష్టంవొచ్చినట్టూ కొట్టి బైటకు తోసేసేడు. ఆ రాత్రే ఎటో బయల్దేరి పోయేడు."

"ఇన్నేళ్ళలోనూ ఒక్కసారైనా మావయ్యకి డబ్బు పంపడంగాని, చివరికి మేం ఎలాగున్నామని ఒక ఉత్తరమేనా రాయడంగాని చెయ్యలేదు మా నాన్న. పోనీ మావయ్యేనా కాస్త కలిగినవాడేమో అనుకుందుకి పాపం అతనూ చాల దీనదశలో ఉంటూన్నవాడే. ఇవన్నీ చూసే నాన్నంటే కోపం, అసహ్యం అన్నీ కలిగేయి. ఇహమీద అతడిముఖం చూడకూడదనుకున్నాను. అతడి సహాయంకోసం ఆశపడదల్చుకోలేదుకూడా" అంటూ ఆవేశంతో చెప్పుకుపోతూంటే నాకు చాలా జాలి కలిగింది.

"ఇంట్లో మా పరిస్థితి మరీ దుర్భరంగా వుంది. మావయ్య తెచ్చే జీతం అతని సంసారానికే చాలదు. పైగా నేనూ, మా తమ్ముడూ కూడా అందులోనే బతకాలి. అక్కడికీ నాకు స్కూలు ఫైనలువరకూ చదువు చెప్పించేడు కూడా."

"ఇవన్నీ చూడలేకే తెగించి ఎవరితోనూ చెప్పకుండా ఈ పూరొచ్చేశాను. స్కూలుఫైనలు పేసయేనుగదా ఉద్యోగం దొరక్కపోతుందా అనే ధైర్యంతో. ఎంత చిన్న ఉద్యోగం దొరికినాసరే మావయ్యకి పట్టుగ సహాయపడాలనే ఉద్దేశంతో వచ్చాను"

అతని ముఖంలో తీవ్రమైన పట్టుదల స్పష్టంగా గోచరిస్తూంది.

"ఒచ్చానేగాని ఎవరిదగ్గిరికి వెళ్ళాలో ఏమని అడగాలో తెలియక నానా అవస్థలూ పడ్డాను. నాకీ కలకత్తా పూర్తిగా కొత్త. ఏమీ తెలీదు. తిరిగితిరిగి సాయంకాలానికీచోటు చేరుకున్నాను. ఇంతలో మీ కారు గేటుముందాగింది. మిమ్మల్ని చూసి ఎవరో పెద్ద ఆఫీసరుగారయుంటారనుకుని తమ దర్శనంకోసం వచ్చాను" అంటూ ముగించి నా కళ్ళలోకి ఆత్రుతగా చూసేడు.

మౌనంగా ఆలోచిస్తున్నాను. ఒక్క క్షణం గడిచాక,

"సరే, రేపు ఆఫీసుకి రా, అక్కడ చూదాం" అన్నాను.

"ఎంత చిన్న ఉద్యోగమైనా సరేనండి. చివరికి ఆఫీసు బోయ్‌గానైనాసరే, తప్పకుండా చేస్తాను" అన్నాడు.

తరువాత, వాళ్ళ హెడ్‌మాస్టరుగారిచ్చేరుట, కాండక్టు సర్టిఫికేటుకూడా చూపించేడు.

ఆ కాగితాన్నందుకని చూసి మా ఆఫీసు అడ్రసుకూడా ఒకచిన్న కాగితంమీద రాసి, రెండూ అతని చేతికిచ్చేను. మర్నాడు పదిగంటలకల్లా ఆఫీసులో కలుసుకోమన్నాను. సంతోషముతో వెళ్ళిపోయేడు కిశోర్.

అప్పటికప్పుడే బాగా చీకటిపడింది. ఊరంతా దీపాలు పెట్టేశారు. మా శ్రీమతిని సినీమాకు తీసికెళ్ళిందుకు క్షమాపణ చెప్పుకుందామని బయల్దేరబోతున్నాను.

అంతలోనే జ్ఞాపకం వచ్చింది ఈ కుర్రాడికి మహాపట్టణంలో ఎవరూలేరుకదా? ఈ రాత్రెక్కడ గడుపుతాడు? భోజనమేంచేస్తాడు? మా ఆఫీసెక్కడో క్లైవుస్ట్రీట్‌లో వుందిగదా? ఆ క్లైవుస్ట్రీటెక్కడో ఎలా కనుక్కోగలడు?

ఇవన్నీ ముందే అడగనందుకు నన్ను నేనే నిందించుకుంటూ ఆఫీసు రూములోంచి బైటకు వచ్చేను.

* • *

మర్నాడు పదిగంటలకి మామూలుగానే ఆఫీసుకి వెళ్ళాను. కిశోర్ ఎదురుగా కనబడి చిరునవ్వుతో నమస్కారం చేసేడు. ఆఫీసు బోయ్‌గానే ఎపాయింట్ చేసేను. పదకొండు గంటలయింది. ఏవోరికార్డులు పరిశీలిస్తూ [illegible]

"అబ్బబ్బ! ఏ క్లార్కు రాసేడో ఈరాతలన్నీ. ఒక్క పోస్టింగూ సరిగా లేదుకదా?"

"ఏయ్! బోయ్!" అంటూ కోపంగా కాలింగ్ బెల్ నొక్కాను.

కిశోర్ లోపలకొచ్చేడు.

"హెడ్ ఎకౌంటెంట్‌ని పిలు" అన్నాను.

కొద్దిసేపట్లోనే యిద్దరూ వొచ్చేరు.

"ఏమయ్యా? ఏమిటీరాతలు? జరిగే వ్యాపారానికీ చేసే పోస్టింగ్సుకీ ఏమైనా సంబంధముండాలా? ఒద్దా? ఎవ్రాసేడంతా?" అంటూ గర్జించాను.

అతనుకూడా చూసి, "బి క్లార్కండి. కొత్త"

"ఏవిటయ్యా కొత్త? ఏడీ, అతన్ని పిలు" అరిచేను కిశోర్ వైపు తిరిగి.

కొద్ది క్షణాల్లోనే కిశోర్ తిరిగివొచ్చి భయముతో బెదురుతూ—"నాకీ వుద్యోగం వద్దండి. నేపోతాను. శలవు" అంటూ నా ఆజ్ఞకోసమైనా ఎదురు చూడకుండా వణుకుతూన్న శరీరంతో వెళ్ళిపోయేడు.

"కిశోర్" పెద్ద పిడుగులాగ అరిచాను.

నాగదంతా ప్రతిధ్వనించింది. నా ముఖంలో అంత కోపం ఆఫీసు స్టాఫెన్నడూ చూడలేదేమో అందరూ భయభ్రాంతులై బొమ్మల్లా నిల్చుండిపోయేరు.

కిశోర్ మీద చాలాకోపం వచ్చింది. పదిహేను వందల రూపాయిలు జీతంగల ఉద్యోగిని రమారమి వందమంది చిన్న ఉద్యోగులపై అధికారిని, నన్ను ఒక ఆఫీసు బోయ్ లక్ష్యం చెయ్యకుండా పారిపోయేడంటే ఎంతకోపమొచ్చిందో.

పోలీసుకి రిపోర్టు చేదామని రిసీవరు తీసేను. మళ్ళా అక్కడే పెట్టేశాను. కిశోర్ మీద కోపాన్నంతటిని ఆ క్లార్కు మీద చూపించేసేను. "నీకేమైనా బుద్ధీ జ్ఞానం ఉందాలేదా?" అంటూ అతడు మాటాడ్డానికైనా అవకాశం ఇవ్వకుండా చీవాట్లు పెట్టేశాను.

సాయంకాలమైంది. వేడితగ్గింది. నా కోపం కూడా కొంచెం తగ్గింది. కానిపూర్తిగా పోలేదు.

సిన్నా నా వేధవనించి ఫేలై పోయాంగాని ఇవాళైనా సినీమాకు పోదామని ఆఫీసునించి కార్లో శరవేగంతో బంగళాకు చేరుకున్నాను.

కారుదిగేనోలేదో మళ్ళా కిశోర్ ప్రత్యక్షమయాడు గేటుదగ్గిర. నన్ను చూడగానే చేతులు జోడించుకుని,

"నమస్కారంసార్" అన్నాడు గద్గదికంగా.

"ఏం మళ్ళావచ్చావ్?" అన్నాను బూటుతో నేలమీద గట్టిగా కొడుతూ.

"క్షమించండిసార్. తమతో ఒక్కసంగతి చెప్పిపోదామని వచ్చానండి. పొద్దున్న తమరు పిలవమన్న క్లార్కు మా నాన్నండి."

"ఆఁ" అని ఒక్కక్షణం నిశ్చేష్టుణ్ణయిపోయాను.

సూర్యరశ్మికి మంచుతెరలు కరిగినట్లు నా కోపమంతా కరిగిపోసాగింది.

"అవునండి. అతనే. అతని పేరు సుందరలాల్. అతని పేరు మీకు చెప్పకూడదన్నాను. కాని నేను చెప్పకుండానే మీకు తెలిసి పోయింది."

"అతనికనిపించడాని కిష్టంలేక తమరు పిలుస్తూన్న వొచ్చేసానండి. మీ కనవసరంగా కోపం తెప్పించేను క్షమించండి. ఇంక నే నీవూళ్ళో వుండ దల్చుకోలేదు. ఎక్కడికైనా వెళ్ళిపోతా" నంటూ ఆఖరిప్రణామం అర్పించి సాగిపోయేడు.

కిశోర్ అలా చెబుతూంటే నిన్నటి కథంతా నా మెదడులో సినీమా రీల్ తిరిగినట్టు తిరిగింది. అతను చెప్పినదంతా యాంత్రికంగా విన్నాను.

నేను మళ్ళా బాహ్య ప్రపంచంలోకి వచ్చేసరికి కిశోర్ నా యెదురుగా లేడు.

"ఏయ్ ఫ్యూన్! కిశోర్‌ని పిలూ. త్వరగా" అంటూ తోలేను వాడిని.

కాని లాభం లేకపోయింది. అప్పటికప్పుడే జనసమూహంలో కలిసిపోయేడు కిశోర్.

ఆ మర్నాడే బి క్లార్కు సుందర్‌లాల్‌కి కూడా స్వస్తి చెప్పాను.